
ఆ జలపాతానికి దూరంగా చిన్న గ్రామం ఉంది. ఆ గ్రామానికీ, జలపాతానికీ మధ్యగా నేషనల్ హైవే పోతుంది. జలపాతం దగ్గరే 'కుసుమ హరనాథుని' దేవాలయం ఉంది.

# ఎవడో మనిషి

బొల్లిముంత నాగేశ్వరరావు



జలపాతం దగ్గరకు జనం టూరిస్టు బస్సుల్లో వస్తారు.

కుసుమ హరనాథుని సందర్శించుకుని జలపాతం దగ్గర స్నానం చేసి జీవితం చేరాల్సిన పరమార్థానికి ఒక మెట్టు ఎక్కామన్న ఆనందంతో జనం తృప్తిపడి వెడుతుంటారు.

జలపాతానికి దగ్గర్లో ఊరికి కాస్తంత ఎడంగా ఉభయకుశలోపరిగా ఉంటుందని ప్రభుత్వం ఆలోచించి ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది.

అందులో వారాని కోసారి వచ్చే డాక్టరూ — ఎప్పుడొస్తుందో — ఎప్పుడు పోతుందో తెలీని ఓ నర్సూ — వాచ్‌మన్ కమ్ స్వీపరూ ఉంటారు.

ఆ ముగ్గురికీ ప్రభుత్వం జీతాలిస్తూ మందులు సరఫరా చేస్తుంది. ప్రభుత్వం సరఫరా చేసిన మందులన్నీ ఆసుపత్రి వరకూ రావు.

ఆ రోజు ఆసుపత్రిలో డాక్టరూ — నర్సూ, వాచ్‌మేన్ అంతా ఉన్నారు.

జలపాతం దగ్గర జనం స్నానాలు చేస్తున్నారు. దేవాలయంలో గంటలు మోగుతున్నాయి. సరిగ్గా అదే సమయంలో నేషనల్ హైవేలో ఓ యాక్సిడెంట్ జరిగింది. ఒక టూరిస్టు బస్సును ఓ లారీ ఢీకొంది. లారీ తల్లక్రిందులయి రోడ్డుకు పక్కనే పడింది. బస్సు మాత్రం ఓ పక్క దెబ్బతిని కాస్తంత దూరంగా పోయి ఆగింది. బస్సులో ఉన్న అయిదుగురికి తీవ్ర గాయా లయ్యాయి. మిగతా వారికి స్వల్పంగా తగిలాయి. బస్ డ్రైవర్, క్లీనర్ ప్రథమ చికిత్స చేస్తూ అందిన వాళ్ల కందినట్టు కట్లు కట్టారు. పడిపోయి లేవలేకుండా ఉన్న అయిదుగురినీ అప్పుడు చూశారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉందని తెలిసి నేరుగా వాళ్లను మోసుకుని ఆరోగ్య కేంద్రానికి పరుగెత్తారు.

హాయిగా ఈగల్ని తోలుకుంటూ కాలక్షేపం చేసే డాక్టరుగారికీ, నర్స్‌కీ ఈ అనూహ్య పరిణామం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఒకరు కాదు — ఇద్దరు కాదు — ఏకంగా అయిదుగుర్ని. అందులోనూ ప్రమాదంగా ఉన్నవారిని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తీసుకురావటమా? వీళ్లకి సరిపడా మందులెక్కడున్నాయ్ తమ దగ్గర. పోనీ దగ్గర్లో ఏదయినా ఆసుపత్రి ఉందా అంటే — ఎటు వెళ్లినా ఇరవై కిలోమీటర్లలోపు ఊరే తగలదు. అక్కడ కెళ్లి కొనుక్కువద్దా మనుకున్నా ఈలోపు వీళ్లు 'హరీ' మంటారు.

పరిస్థితి గమనించిన డాక్టరు గారికి పచ్చి వెలక్కాయ గొంతులో పడినంత పనయింది.

"నర్స్ ! మెడికల్ షెల్ఫ్‌లో కంప్రెస్ కేమున్నాయో చూడు."

ఆమె షెల్ఫ్ తెరచి ఒక్కసారిగా అరిచింది.

"సర్ !కొద్దిగా కాటన్ — గాజ్ క్లాత్ రీల్ — సీసాలో అడుక్కి చేరిన టించరూ. మందులు కూడా ఏం లేవు సార్ ! ఓ పెన్సిలిన్ ఇంజెక్షన్ — ఓ పెయిన్ కంట్రోలర్ ఉన్నాయి" అంది.

డాక్టర్ గారికి ముచ్చెమటలు పట్టాయి. కాస్సేపు అలాగే శిలాప్రతిమలా నిలుచుండిపోయారు.

అయిదుగురినీ ఆసుపత్రి వరండాలో పడుకోబెట్టి — మిగతా యాత్రికులు బయట నిలబడ్డారు. ఎంతసేపటికీ డాక్టరు నుండి ఏ సమాధానమూ రాకపోయేసరికి — జనంలోంచి ఓ కుర్రవాడు అరిచాడు.

"సార్ ! ఇక్కడ ప్రాణాలు పోతున్నాయి. వీళ్లను బ్రతికించండి సార్ !"

డాక్టరు మెల్లిగా బయటికి వచ్చి —

"ఏం బ్రతికించమయ్యా ! ఏక్సిడెంట్ పెద్దది. ఆసుపత్రి చిన్నది. మా దగ్గరున్న బాండేజ్ క్లాత్ — కాటన్ — మందులూ మొత్తం వాడితే ఒకరికి సరిపోతుంది. మీరేమో అయిదుగురిని తీసుకువచ్చారు. ఈ అయిదుగురికీ చికిత్స మా వల్ల కాదు. ఎవరో ఒక్కరిని తీసుకురండి లోనికి. ఆయన్ను మాత్రం ఫస్ట్ ఎయిడ్ చేసి ఎలాగో బ్రతికిస్తాం" అన్నాడు.

అందరి నెత్తినా పిడుగు పడినంత పనయింది.

ఒక్కరికే మందులు సరిపోతే ఆ ఒక్కరినీ లోనికి తీసుకొచ్చే బాధ్యత మరలా యాత్రికుల మీదే పెట్టాడు. అందరి ప్రాణాలూ సమానమయినప్పుడు ఎవరిని కాదని ఎవరిని తీసుకెళ్లాలి? అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. తరువాత వారంతా వరండాలో పడి ఉన్న నలుగురి వంకా చూశారు. అందరూ మూలుగుతున్నారు. అందరి శరీరాలూ రక్తసిక్తమయ్యాయి.

"ఆలస్యం చేస్తే అమృతం విషంగా మారుతుంది. ఒక్కరన్నా బ్రతుకుతారు. ఎవరో ఒకరిని కాస్త నలుగురికీ ఉపయోగపడే మంచి మనిషిని తీసుకురండి." డాక్టరు మరలా కేక పెట్టాడు.

'నలుగురికీ ఉపయోగపడే' అనే మాట డాక్టరుగారి నోటి నుండి వినేసరికి అందరి మెదళ్లూ పాదరసంలా పనిచేయటం మొదలెట్టాయి.

ఒక మనిషి వరండాలోకి వచ్చి అక్కడ పడి ఉన్న అయిదుగురినీ చూశాడు.

ఆయన డాక్టర్ చెన్నకేశవరావుని గుర్తించాడు. ధర్మాసుపత్రిలోని డాక్టర్. ఇటీవలే తమ ఇళ్లకు దగ్గర్లోనే ఓ పెద్ద ఇల్లు కట్టుకున్నాడు వెంటనే.

"డాక్టరు చెన్నకేశవగారిని బ్రతికించండి. ఆయన ప్రాణం నిలవటం వల్ల పది మంది ప్రాణాలు నిలుస్తాయి. సమాజానికి అంతకంటే ముఖ్యమైన మని షెవరుంటారు?" అన్నాడు.

చాలా మంది సరేనంటే 'మరే' అన్నారు. కానీ మందిలోంచి ఓ బక్కగా ఉన్న నడి వయసు మనిషి ముందుకొచ్చాడు.

"ఆపండి ! ఆయన్ను బ్రతికించటం ఉత్త దండగ. పేరుకు ధర్మాసుపత్రి డాక్టర్. ఒక్క పేదవాడికి వైద్యం చేయడు. ఇంటి దగ్గర ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్ పెట్టుకున్నాడు. ఆసుపత్రిలోని మందులన్నీ అక్కడికి తరలిస్తాడు. ఆయన గురించి నాకు బాగా తెలుసు.

"ప్రజల సొమ్ము జీతాలుగా తీసుకుంటూ, మందులుగా అమ్ముకుంటూ, ఉచితంగా అందాల్సిన సేవలకు 'వెలల్ని' నిర్ణయించి చాలా దుర్మార్గానికి పాల్పడ్డాడు. నా విషయంలోనే ఒక అన్యాయం చేశాడు. నా భార్యను కాన్పు కోసం తీసుకెళ్లాను. 'కాన్పు కష్టమయింది. ఆపరేషన్ చేయాలి ఐదు వందలు తెచ్చుకోమన్నాడు. నేను నా నిస్సహాయతను ప్రకటించాను. నన్ను అసహ్యంగా చూసి ఇంటి కెళ్లిపోయాడు. చివరికి ఆమె పిండం అడ్డం తిరిగి ఆ రాత్రి మెలికలు తిరిగి చనిపోయింది.

"డాక్టరు వృత్తి గొప్పదే. దేవుడి తరువాత దేవుడిలాంటి మనిషి. ప్రాణాలు పోస్తే దేవు డంటాం. అదే ప్రాణాలు తీస్తే దయ్య మంటాం. వాడు దయ్యంకంటే భయంకరుడు. వాడు చావటమే మంచిది. ఆ స్థానంలోకి మరో మంచి డాక్టరు వచ్చే అవకాశం ఉంటుంది. వాడు పేదల పాలిట ఒక చావులాంటి వాడు. ఆ 'చావు'ను చావనీయండి. బ్రతుకులు




బ్రతుకుతాయి." అతని ఆవేదనపూరితమైన మాటలు విన్నాక అందరికీ మనసు విరిగింది.

'అలాంటి వాడయితే అతన్ని బ్రతకనీయటం దండగ !' మరెవరో అరిచారు.

ఇదంతా ఆసుపత్రి డాక్టరూ, నర్సూ విన్నారు. మందు లమ్ముకుంటూ సేవలు చేయని ప్రభుత్వ డాక్టర్ల మీద ప్రజల కెలాంటి అభిప్రాయం ఉందో వారికి అర్థమయింది.

ఇంతలో మందిలోంచి మరో మనిషి వరండాలోకి వచ్చి అయిదుగురినీ చూశాడు.


'అరె ఇంజనీరుగారు' పెద్దగా అరిచాడు. వెంటనే జనంతో చెప్పటం మొదలెట్టాడు. "ఈయన నాకు తెలుసు. కాంట్రాక్టరు సుబ్బన్నగారి అల్లుడు. ఈయన్ను బ్రతికిస్తే మంచిది" అది వినటంతో —

మరో మనిషి మందిలోంచి అన్నాడు.

'ఇంజనీరయితే అతన్నే బ్రతికిద్దాం. దేశ నిర్మాణంలో వీళ్ల పాత్ర చాలా ఉంది. అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాలకి ఇంజనీర్లూ, టెక్నీషియన్లూ చాలా మంది అవసరం.' అందుకు చాలా మంది 'సరే... ఈయన కన్నా వైద్యం చేయమనండీ' అన్నారు.

కానీ ఒక ముసలాయన ముందుకొచ్చి

'కాంట్రాక్టరు సుబ్బన్న అల్లు డన్నారు కదూ




!' అంటూ అడిగాడు.

వరండాలో ఉన్న మనిషి అవునన్నాడు.

'నీకు వాడు మనిషిగానే తెలుసు. ఇంజనీరుగా నాకు తెలుసు. మీకు గుర్తుండే ఉంటుంది. మన గ్రామానికి దూరంగా ఉన్న 'గంగడోలు' వాగు మీది శబరి తల్లి వారధి అయిదేళ్ల క్రితం కూలిన సంగతి ! అది కట్టిం దెవరుకున్నావ్? వీడి మామా, వీడూ ! దేశంలో దొంగలు పడ్డారంటారే — అందులో వీడి మామా, వీడు సభ్యులు. లక్షల రూపాయల ప్రాజెక్టు నీటిపా లయింది. ఆ వారధి కూలేప్పుడు దాని మీద ఉన్న పదిమంది చనిపోయారు. ఒక ఎడ్లబండి, దాన్ని నడిపే మనిషి కూడా అందులో కలిసిపోయారు. ఆ బండి నడిపే మనిషి ఎవరో కాదయ్యా ! నా కొడుకు.

"ఇంజనీర్లు అవసరమే. ఎలాంటి ఇంజనీర్లు? మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి ఇంజనీర్లు ! కాంట్రాక్టర్ల మోచేతి గంజినీళ్లు తాగుతూ ప్రజల సొమ్మును పంచుకుతినే ఇలాంటి గీరుడు సరుకు కాదయ్యా మనకు కావల్సింది ! వీడు బ్రతికితే మరో వారధి కూలుతుంధి. జన నష్టం, ధన నష్టం తప్ప ఏం ఉండదు !" ఆయన గొంతు దుఃఖోద్వేగం. 'వారధి' కూలిన సంఘటన వారి మనస్సుల్లో మెదిలింది. మరలా కదుతున్నారు. ఇప్పటికీ అది పూర్తికాలేదు.

జనమంతా 'అయితే వాడిని బ్రతికించవద్దు' అంటూ అరిచారు.

"పోనీ మీరే చెప్పండి." అలా చెప్పిన ముసలాయ న్నుద్దేశించి ఎవరో అన్నారు. ఆ ముసలాయన వరండాలోకి వెళ్లి చూశాడు. వద్దనుకున్న డాక్టరూ, ఇంజనీరూ ఒక పక్కనే ఉన్నారు. మిగిలిన ముగ్గురిలో వైట్ పాంట్, గ్రీన్ షర్టు ధరించిన మరో నడివయసు మనిషి ఆయన దృష్టి నాకర్షించాడు.

"ఇదిగో — ఈయన్ను బ్రతికించండి. కుటుంబరావుగారని కాలేజీ లెక్చరర్ ! బాగా చెప్తాడని పేరుంది" అన్నాడు.

ఇంతలో మందిలోంచి చదువుకున్న ఒక మనిషి ముందు కొచ్చి —

"ఉపాధ్యాయుడా ! వెరీ గుడ్ ! అయితే ఆయన్నే బ్రతికించండి. ఈ దేశ భవిష్యత్తంతా పాఠశాల నాలుగు గోడల మధ్య నిర్మించబడుతుందని ఒక మహాశయుడు చెప్పాడు. డాక్టర్లూ, ఇంజనీర్లూ మేధావులూ అందరూ ఆయన చేతుల్లోంచి రావాల్సిన వారే. పవిత్రమైన వృత్తి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయన్ను లోనికి తీసుకెళ్లండి !"

అందరూ ఏకగ్రీవంగా ఓకే అన్నారు.

డాక్టరూ, నర్సూ ముందు కొచ్చారు.

సరిగ్గా అదే సమయంలో జనంలోంచి ఓ కుర్రవాడు ముందుకొచ్చి

"ఆగండి !" అంటూ అరిచాడు.

మరలా ఏమిటన్నట్టు జనం అతని వంక చూశారు.

"ఏ డాక్టర్లూ — ఇంజనీర్లూ ఈ దేశానికి పనికిరారు. వాళ్లను చావనీయండని మీరు తీర్మానించారో — ఆ డాక్టర్లూ, ఇంజనీర్లనే ఈయన తయారుచేస్తున్నది. ఈయన ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్. కానీ అందులో పాఠా లెప్పుడూ చెప్పడు. నేను చాలా పేదవాడిని. పదో తరగతిలో రాంక్ తెచ్చుకుని ఎన్నో ఆశల్తో కాలేజీలో చేరాను. నేనూ ఇంజనీరునే అవుదామనుకున్నా. ఈయన లెక్కలు సరిగా చెప్పేవాడు కాదు. ఇంటి దగ్గర రెసిడెన్షియల్ కాలేజీ నొకదాన్ని స్థాపించి అందులో చేరమని అందరినీ వత్తిడి చేసేవాడు. అర్థంకాలేదు మరోసారి చెప్పండంటే ప్రైవేట్‌కు రమ్మనేవాడు. వేల రూపాయలని వెచ్చించి చదువు'కొనే' స్తోమతు మా కుటుంబానికి లేదు. నా తండ్రీ రెక్కల మీద బ్రతికే ఒక శ్రమ జీవి. ఫలితంగా నేను ఇంటర్‌లో తప్పాను. ఆ కాలేజీలో నాలాంటి నిస్సహాయులు, అసహాయులు ఎదరో ఈ అయ్యగారి అన్యాయం వల్ల నిట్టూర్చారు.

"సేవా వృత్తులు వ్యాపారంగా మారటం వల్లే అలాంటి డాక్టర్లూ, ఇంజనీర్లూ తయారయ్యారండి. వేలు ఖర్చు చేసి సంపాదించుకున్న వృత్తితో లక్షలు సంపాదించాలనే తపన. ఆ తపన మొత్తానికి ఇలాంటి ఉపాధ్యాయులే మూలకారణం. పవిత్రమైన వృత్తుల్లో వచ్చి వ్యాపారుల్లా తయారయ్యారు. ఆ లెక్చరర్‌ని బ్రతికించటానికి నేను అంగీకరించను. అంతకంటే ఉపయోగపడే మనిషెవరైనా ఉన్నాడేమో చూడండి" అంటూ ఉద్వేగంగా అన్నాడు. జనం మరలా మోషన్‌లెస్‌గా మారిపోయారు.

ఇదంతా వింటూ నిలబడిన డాక్టర్

"త్వరగా తేల్చండయ్యా భాబూ ! ఇలాగే చర్చించుకుంటూ కూర్చుంటే ఆ ఒక్కడు కూడా దక్కకుండా అందరూ హరీ మంటారు."

డాక్ట రా మాట అనగానే అయిదుగురిలో ఒకతనికి కొంచెం స్పృహ వచ్చింది.

"రేయ్ నన్ను బ్రతికించండిరా. నేనురా ! చెంచురాయుడ్ని." హీనస్వరంతో అన్నాడు. చాలా మందికి ఆ మాట వినపడింది.

చెంచురాయు డనేసరికి అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

ఆయన ఆ ఏరియాలో మంచి పేరున రాజకీయవేత్త. రేపు రాబోయే ఎలక్షన్స్‌లో ఆయనకు ఎం.ఎల్.ఏ. సీటు ఖాయమని అంటున్నారు. ఆయన గెలవటం కూడా ఖాయమే. అదివరలో ఇద్దరిని ఆ ఏరియాలో ఎంఎల్‌ఏలుగా గెలిపించాడు కూడా. ఈసారి ఆయన గెలిస్తే మంత్రి పదవి కూడా వస్తుం దంటున్నారు.

వెంటనే ఒక మనిషి ముందు కొచ్చి

"ఎంత పొరపాటు చేశారండీ ఇప్పటిదాకా ! ఆయన ఉన్నాడని చూడకపోతిమి. ముందు ముందు ఎన్నో పనులు మన ఏరియాకు చేయాల్సిన మనిషి. ఈ సమయంలో ఆయన్ను మనం బ్రతికించుకుంటే మనందరికీ ఏదో రకంగా ఉపయోగపడతాడు. డాక్టర్ గారూ ! ఇంకా ఆలస్యం ఎందుకు. ఆయన్ను బ్రతికించండి !" అన్నాడు.

"అయితే తీసుకురండి. రాజకీయ నాయకుడైతే ఇంకా చూస్తారేమయ్యా? నాకూ ట్రాన్స్‌ఫర్ కావాలి. ఆయన బ్రతికితే అది తప్పక జరుగుతుంది." ఆయన ముఖం చేటంతయింది. నర్స్ కూడా ఎగిరి గంతేసింది. జనం కూడా మౌనంగా తమ అంగీకారాన్ని తెలియచేశారు. సరిగ్గా అప్పుడు — ఒక కుర్రవాడు ముందు కొచ్చాడు. అతని భుజానికి ఏదో సంచి తగిలించి ఉంది. అప్పటివరకూ మౌనంగా కూర్చుని అందరూ చెప్పేది వింటున్నాడు. రాజకీయ నాయకుడ్ని బ్రతికించటానికి అందరూ అంగీకరించటంతో అతడు ముందు కొచ్చి —

"త్వరపడకండి" అన్నాడు.

"ఇంకా ఏమిటి? త్వరపడకపోతే ఆయన కూడా దక్కడు మనకి." మరో మనిషి మందిలోంచి కేక పెట్టాడు.

"మీ రెప్పుడైనా 'లయన్ మేకర్స్' కథ

విన్నారా?" అంటూ ప్రశ్నించాడు.

అందరూ మేం వినలేదంటే మేం వినలేదన్నారు.

డాక్టర్ ముందు కొచ్చి —

"ఏం కథలయ్యా! ఆయన్ను బ్రతికించాల్సిందే. ను వ్వాగు" అనగానే.

ఆ కుర్రవాడి కళ్లు ఎర్రగా మారాయి.

"ఆగండి డాక్టర్! ఏ మనిషిని బ్రతికించుకోవాలో అనే ఒక పనిని మీరు మా కప్పజెప్పారు. ఒక మనిషి చచ్చిపోవచ్చుగానీ, ఈ సమయంలో ఓ చెడ్డవాడు బ్రతకగూడదు. వాడు బ్రతికి మంచిని చంపేస్తాడు. మీ 'ట్రాన్స్‌ఫర్' అనే స్వార్థంతో మా చర్చలో అనవసర జోక్యం చేసుకోవద్దు" అన్నాడు.

అతనిముఖం ఎర్రగా మారటంతో డాక్టర్ కొంచెం భయపడి వెనక్కి తగ్గాడు.

తరువాత కుర్రవాడు చెప్పటం మొదలెట్టాడు.

"ఈ చెంచురాయుడ్ని గురించి మీకు తెలీదా? ఓట్ల రిగ్గింగ్ జరపటం, ఎంఎల్ఏలను గెలిపించటం. ఒక్కసారి మీ గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి. ఏనాడయినా బూతు కెళ్లి మీ ఓటు మీరు వేశారా? లేదు. ఈ ప్రజాస్వామ్యమనే ముసుగులో కొనసాగుతున్న గూండాయిజానికి ఈ రాయుడో ప్రత్యక్ష సాక్ష్యం.

"చనిపోయిన సింహాన్ని బ్రతికించి దానికి బలైపోయిన ముగ్గురి మూర్ఖుల కథను మన వాళ్లెందుకు రాశారో నా కిప్పుడు అర్థమవుతుంది. ఈయన్ను బ్రతికించటం అంటే ఓ సింహాన్ని బ్రతికించటమే. బ్రతికి మనందరినీ వరుసగా తింటాడు.

"డాక్టరూ, ఇంజనీరూ, లెక్చరర్ వీళ్లెవరూ పనికిరానప్పుడు నన్ను ఎన్నుకున్నారేగానీ — ముందుగా నన్ను ఎన్నుకోలేదు. ఆ ఏరియా మొత్తాన్నీ టెర్రిఫై చేసే గూండాని... నేను గుర్తురాలేదురా మీ కంటూ ఈ రోజు బస్సెక్కిన మనందరినీ వేటాడి మరీ చంపుతాడు. మనల్నే కాదు. రేపు జరగబోయే డెమోక్రసీ అనే ఎన్నికల జాతర్లో ఎందరో అమాయకుల్ని వధ్యశిలకు జేరుస్తాడు. ఇలాంటి చీడపురుగులు ఎన్ని నాశనమయితే ఈ దేశానికి అంత నిష్కృతి. ఇప్పటికీ శాసనసభలన్నీ గూండాల్తో నిండిపోతున్నాయి. రాజ్యాంగంలోని ఒక్క పేజీ కూడా చదవని వాళ్లు ఈ రాజ్యాన్ని పాలిస్తున్నారు. చర్చ జరపాల్సిన శాసనసభలో శిగపట్లతో గుద్దులాట తప్ప జరగటంలేదు. ఇతన్ని కూడా బ్రతికించి రేపు శాసనసభకు పంపితే — అక్కడ బల్లలు పగలటం, మైకులు విరగటం తప్ప ఏం జరుగదు. జన జీవనం ఇలాంటి స్కాండల్స్ కుంభకోణాల్లో కుంచించుకుపోతుంది. వద్దు సార్! ఇతన్ని బ్రతికించవద్దు. ఆ మిగిలిన మరో మనిషిని చూడండి." అన్నాడు.

అందరూ మరలా మౌనంగా తమ అంగీకారాన్ని తెలియజేశారు. ఈలోపు ఆ మిగిలిన మనిషెవరో చూదామని మంధిలోంచి ఒక మనిషి వెళ్లాడు. ఆయన ఆ ఐదో మనిషిని పరిశీలించి —

"అరె! ఈయనా! పరంధామయ్య. మన గ్రామంలో రైతు. అయిదెకరాల పొలం ఉంది. నిత్యం పొలం పని తప్ప వేరే వ్యాపకంలేదు" అనగానే ఇంతకుముందు చెంచురాయుడ్ని బ్రతికించవద్దన్న కుర్రవాడు మరో అడుగు ముందుకేసి —

"ఎస్! అయితే ఆయన్ను బ్రతకనివ్వండి. అందరి వృత్తుల్లోనూ చీకటి కోణాలున్నాయిగాని ఆయన వృత్తిలో లేదు. ఈ దేశానికి వెన్నెముకని కీర్తించబడుతూ, నిత్యం అన్ని వర్గాల చేతా పీడించబడేవాడు.

"ఆయన బ్రతికితేనే ఈ దేశం. బ్రతుకుతుంది.

"ఆయన నాగలి పట్టటం వల్లే ఒక డాక్టరు స్టెతస్కోపులో గుండెల చప్పుడు వినిపిస్తోంది. ఒక ఇంజనీరు బైనాక్యులర్‌లో ఈ దేశం ఫ్యూచర్ ప్లాన్ కనిపిస్తుంది. ఒక యాక్టర్ నటించినా —ఒక గాయని పాడినా — ఒక నర్తకి ఆడినా అన్నీఆయన బ్రతికి నాగలి పడితేనే! ఆలోచించండి!

"ఎండలో, వానలో, చలిలో బంజరు భూముల్ని పంట భూములుగా మార్చి, రక్తాన్ని స్వేదంగా కార్చి ఈ దేశానికి అన్నం అందిస్తున్న ఈ భూమి మీదున్న భగవంతుడే ఆయన!

"ది గ్రీన్ మాన్ ఆఫ్ ది వరల్డ్.

"ది క్రియేటర్ ఆఫ్ ఎనర్జీ ఆఫ్ హ్యూమానిటీ! బండల్ని పగలగొట్టి వాటిలోంచి తిండిగింజల్ని మనందరి పొట్టల కోసం తీసే శ్రమైక జీవన సౌందర్యజీవి ఆయన. ఆయన్ని చంపుకుంటే మనల్ని మనం చంపుకున్నట్లే. పదండి. ఆయను లోనికి తీసుకెళ్దాం" అన్నాడు.

అందరి ముఖాల్లోనూ ఏదో సంతృప్తి.

వైద్యం చేసే డాక్టరు కూడా ఆ కుర్రవాడి మాటల్ని శ్రద్ధగా విన్నాడు. ఆయన ముఖం మొదట అసంతృప్తితో ఉన్నా మెల్లిగా అదీ మాయమైంది.


ప్రాణం అందరిదీ ఒకటే అయినా — ఆ పరిస్థితుల్లో అక్కడి జనం ఆ నిర్ణయం తీసుకోలేక తప్పలేదు.

మనం సంపాదించిన ఆస్తులు కావు మన వెంట వచ్చేది — పాపం — పుణ్యం మాత్రమే చివరి కంటూ మనల్ని వెంటాడుతూ వస్తాయనే పెద్దవాళ్ల మాట అక్కడ అక్షరాలా రుజువు అయింది. మొదటి నలుగురినీ వారు చేసుకున్న పాపం మింగింది. ఐదో మనిషి చేసిన పుణ్యం ఆయన్ను బ్రతికించింది.

ఆ సమయంలో అందుకే ఆసుపత్రిలో ఒక్కరికి మాత్రమే సరిపడా మందు లున్నాయేమో!

చనిపోయిన వారి ఆత్మలు శాంతించుగాక.!..

◆



## ముందు చూపు

"హుస్సేన్ సాగర్‌లో బోట్ షికారు చేస్తున్నారు భార్యా భర్తలు.

"ఏమే! సడన్‌గా పడిపోయి నేను మునిగిపోతున్నా ననుకో. ను వ్వేం చేస్తావు?" భర్త అడిగాడు.

"ఆ అనుమానంతోనే బోట్ నడపడాన్ని గురించి ముందే చెప్పెయ్యమంటున్నా" అంది తడుముకోకుండా.

వి.మల్లికార్జునరావు (హైదరాబాదు)

